క్లుప్తంగా

నేడు 'చలో కలెక్టరేట్'

అయిజ: పట్టణంలోని పాతబస్టాండ్ – కొత్త బస్టాండ్ మధ్య నిర్మించిన వంతెన వెంటనే ప్రారంభించాలని కోరేందుకు సోమవారం అన్ని పార్టీల, సంఘాల నాయకులు కలెక్టరేట్ చేరుకోవాలని అఖిలపక్ష కమిటీ నాయకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8:30 గంటలకు అఖిలపక్షం కమిటీ నాయకులందరూ పట్టణంలోని ఇంటిగ్రేటెడ్ మార్కెట్ భవనంలో సమావేశం కావాలని సూచించారు. ఉదయం 9 గంటలకు గద్వాలకు బయలుదేరి 11 గంటలకు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేయాలని పేర్కొన్నారు.

ప్రమాదమంచున ప్రయాణం



మల్దకల్: గూడ్స్ వాహనాల్లో ప్రయాణికులను తరలిస్తూ ప్రజల ప్రాణాలతో ప్రైవేట్ వాహనదారులు చెలగాటమాడుతున్నారు. నిత్యం కర్ణాటకలోని వివిధ ప్రాంతాల నుంచి మల్దకల్ మండలానికి కూలీలు వస్తున్నారు. ఒక్కొక్క వాహనంలో దాదాపు 20నుంచి 40మందికి పైగా ప్రయాణికులను తరలిస్తున్నారు. ఈ విషయమై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రైవేటు వాహనదారులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు

ఉండవెల్లి: మండలంలోని కంచుపాడు గ్రామానికి చెందిన ఎరుకలి రాజేష్, అతని స్నేహితుడు, మాల శివ శంకర్ అతని స్నేహితులు అందరు కలిసి మద్యం తాగడానికి వెళ్లారు. ఈ క్రమంలో రాజేష్‌కు, శివశంకర్ మధ్య మాటమాట పెరిగి గొడవకు దారి తీసింది. మాల శివశంకర్‌పై రాజేష్ అతని స్నేహితుడు కలిసి దాడి చేయగా గాయాలయ్యాయి. మాల శివ శంకర్ ఫిర్యాదు మేరకు ఎరుకలి రాజేష్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

జూలెకల్‌లో సమ్మర్ క్రికెట్ టోర్నమెంట్

శాంతినగర్: ఈనెల 8 నుంచి జూలెకల్‌లో సమ్మర్ స్పెషల్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు నరేష్, లక్ష్మీరెడ్డి, రాజు తెలిపారు. ప్రతి మ్యాచ్‌కి మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్, మ్యాన్ ఆఫ్ ది సీరీస్ ఉంటుందన్నారు. ఫైనల్ మ్యాచ్ రోజు భోజన వసతి కల్పించామన్నారు. విజేతలకు మొదటి బహుమతి రూ.15,016, రెండో బహుమతి రూ.8,016 నగదు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

బీఆర్‌ఎస్‌లో చేరిన బీఎస్పీ నాయకులు

శాంతినగర్: బీఎస్పీకి చెందిన వడ్డేపల్లి, రాజోళి మండలాల నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి సమక్షంలో పెద్ద ఎత్తున బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. వారికి గులాబీ కండువాలు కప్పి ఎమ్మెల్సీ పార్టీలోకి ఆహ్వానించారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి



రాజు (ఫైల్)

ఎర్రవల్లిచౌరస్తా: చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందిన ఘటన ఇటిక్యాల పీఎస్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్ఐ వెంకటేష్ కథనం మేరకు.. ఎర్రవల్లి మండలంలోని యాక్తాపురం గ్రామానికి చెందిన రాజు (29) పని నిమిత్తం శనివారం రాత్రి తన ద్విచక్ర వాహనంపై ఎర్రవల్లికి వచ్చి తిరిగి స్వగ్రామానికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఎర్రవల్లి కూడలిలో 44వ జాతీయ రహదారిని దాటుతుండగా హైదరాబాద్ నుంచి కర్నూల్ వైపు వెళ్తున్న కావేరి ట్రావెల్ బస్సు బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రాజుకి తీవ్ర గాయాలు కావడంతో గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో కర్నూల్‌లో ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అర్ధరాత్రి మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు బస్సు డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

బండారు ఉత్సవాలు

కృష్ణా: మండలంలోని హిందుపూర్‌లో ఆదివారం కొనసాగిన బీరదేవర బండారు ఉత్సవాల్లో వేలాదిమంది భక్తులు పాల్గొని పూజలు నిర్వహించారు. ఉత్సవ కమిటీ సభ్యుడు శ్రీకాంత్ మాట్లాడుతూ.. ఈ బండారు ఉత్సవాలను 12ఏళ్లకు ఒకమారు నిర్వహిస్తుండడంతో మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్ర ప్రాంతాల నుంచి వేలమంది భక్తులు పూజలో పాల్గొన్నారు.

విద్యార్థికి సన్మానం

అమరచింత: పదో తరగతి ఫలితాల్లో 9.8 జీపీఏ సాధించిన అమరచింత విద్యార్థిని ను జాహాత్‌ను ఆదివారం జామీయా మసీదు కమిటీ, అంబేడ్కర్ జాతర కమిటీ ఆధ్వర్యంలో శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యలో రాణించి అనుకున్న లక్ష్యాన్ని సాధించి తన తల్లిదండ్రులతో పాటు పట్టణానికి పేరు ప్రతిష్టతలు తీసుకురావాలని సూచించారు.

సాగుకు సమాయత్తం

- రికార్డు స్థాయిలో ఎండలు
- ఉదయం వేళల్లో పొలాల వద్ద రైతుల పనులు
- సమీపిస్తున్న ఖరీఫ్ సీజన్
- అందుబాటులోకి రాని విత్తనాలు, ఎరువులు



బూరెడ్డిపల్లి శివారులో వేసవి దుక్కులు సిద్ధం చేస్తున్న రైతు

ధరూరు: ముందస్తు ఖరీఫ్ సాగుకు రైతులు సమాయత్తమవుతున్నారు. ఖరీఫ్ సీజన్‌కు సమయం దగ్గరపడుతుండడంతో పొలాల వద్ద పంటల సాగుకు అనువుగా మార్చుకునే పనుల్లో బిజీబిజీగా ఉంటున్నారు. ఖరీఫ్ మెట్ట పంట సాగు కోసం రైతులు పంట పొలాలను సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే దాదాపుగా వేసవి దుక్కులు దున్నుతూ పంట సాగుకు అనువుగా పొలాలను సిద్ధం చేశారు. నడిగడ్డ ప్రాంతంలో ఎక్కువ సాగయ్యే పత్తి పంటసాగు పనులు ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. బోర్లు, ఇతర నీటి వనరులున్న రైతులు ఇప్పటికే పత్తి సాగు పనులు ముమ్మరం చేశారు. వాతావరణం అనుకూలిస్తే ఈ నెలాఖరు వరకు ఖరీఫ్ మెట్టసాగు పనులు ప్రారంభించే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో రైతులకు అవసరమైన సబ్సిడీ విత్తనాలు, ఎరువులను అధికారులు అందుబాటులో ఉంచాల్సిన అవసరం ఉంది.

పొలాల వెంట పరుగులు..

మొన్నటి వరకు ఇళ్లకే పరిమితమైన రైతులు ఇటీవల ఉమ్మడి జిల్లా పరిధిలో అక్కడక్కడ చదురుమదురు వర్షాలు కురువడంతో పొలాల బాట పడుతున్నారు. మండలంలో ప్రధానంగా మెట్ట పంటగా ఆముదం, కంది, సజ్జ, జొన్న వంటి పంటలను సాగు చేస్తారు. రైతుల డిమాండ్ మేరకు విత్తనాలను అందుబాటులో ఉంచాలి. ప్రధానంగా నవ భారత్, గౌచ్–4 వంటి రకాల ఆముదం విత్తనాలు అందుబాటులో ఉంచాలి. వ్యవసాయ శాఖ సబ్సిడీపై ఇచ్చే విత్తనాలు అందుబాటులోకి తీసుకు రావాలని కోరుతున్నారు.



పొలంలో వేసుకున్న పశువుల ఎరువు

జోరందుకున్న పనులు..

వ్యవసాయ పొలాల్లో ఎటు చూసినా రైతులే కనిపిస్తున్నారు. దుక్కుల్లో నలుచు(చెత్త)ఏరడం, కాల్చడం, ఆముదం సాగు కోసం అచ్చు కొట్టడం వంటి పనులు చురుగ్గా కొనసాగుతున్నాయి. వావీటితో పాటు పశువుల ఎరువులు చల్లడం, ఒండ్రు మట్టిని పొలాల్లో పరిచి నేలలను సారవంతం చేసుకుంటున్నారు. ఎండల తీవ్రత అదే స్థాయిలోనే ఉంటుండంతో రైతులు ఉదయం వేళల్లోనే పనులు ముగించుకుని ఇళ్లకు చేరుకుంటున్నారు. నడిగడ్డ ప్రాంతంలో అత్యధికంగా సాగయ్యే సీడ్ పత్తి సాగు కోసం రైతులు పొలాలను సిద్ధం చేస్తున్నారు. మరో 10–15 రోజుల్లో రైతులకు ఆర్గనైజర్లు విత్తనాలు ఇస్తుండడంతో రైతులు అందుకు సాగు పనులు చేసుకుంటున్నారు.

ముందస్తు చర్యలు శూన్యం..

మండలంలో వ్యవసాయ శాఖ ముందస్తు ఏర్పాటు చేయడంలో ఏటా విఫలమవుతూనే ఉంది. మరో వారం పది రోజుల్లో పంట సాగు పనులు ప్రారంభం కానున్న నేపథ్యంలో అధికారులు ముందస్తు చర్యలు చేపట్టడంలో పూర్తిగా విఫలమవుతున్నారు. ఏటా ఆలస్యంగా విత్తనాలు, ఎరువులు సరఫరా చేస్తుండడంతో రైతులు గత్యంతరం లేక ప్రైవేట్ దుకాణాల్లో అధిక ధరలకు విత్తనాలు కొనుగోలు చేస్తున్నారు. అక్కడ నాణ్యమైన విత్తనాలు దొరకక ఏటా రైతులు నష్టాలు చవిచూస్తున్నారు.

కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పని చేయాలి

- జెడ్పీ చైర్‌పర్సన్ సరిత



కాంగ్రెస్‌లో చేరిన వారితో జెడ్పీ చైర్‌పర్సన్ సరిత

గద్వాల అర్బన్: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పని చేయాలని జెడ్పీ చైర్‌పర్సన్ సరిత అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్ ఆధ్వర్యంలో జమ్ములమ్మ ఆలయ కమిటీ డైరెక్టర్ కమ్మరి సునీత రాము, పలువురు యువత, మల్దకల్ మండలం తాటికుంటకు చెందిన రామచందర్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి జెడ్పీ చైర్‌పర్సన్ సరిత కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను 100 రోజుల్లోనే మహలక్ష్మి పథకం, ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇల్లు, ఉద్యోగాల భర్తీ వంటివి చేపట్టిందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కోటేష్, నర్సింహులు, స్వామి నాయుడు, అమరవాయి కృష్ణారెడ్డి, మధుసూదన్ బాబు ఉన్నారు.

కార్మిక వ్యతిరేక బీజేపీని ఓడిద్దాం



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి

గద్వాల అర్బన్: కార్మిక, ప్రజావ్యతిరేక మతోన్మాద బీజేపీని ఓడించి, లౌకిక కూటమి అయిన ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించుకుందామని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన హమాలీ సమావేశంలో ఆయన మాట్లాడారు. గడిచిన పదేళ్ల బీజేపీ పాలనలో కార్మికులు వేతనాలు, ఆదాయం తగ్గించిందన్నారు. దేశవ్యాప్తంగా నిరంకుశ బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా లౌకిక కూటమి అయిన ఇండియా కూటమి అభ్యర్థుల గెలుపునకు సీఐటీయూ కృషి చేస్తోందని తెలిపారు. నాగర్‌కర్నూల్ పార్లమెంటరీ నియోజకవర్గంలో ఇండియా కూటమి బలపర్చిన అభ్యర్థి మల్లు రవికి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నామన్నారు. సమావేశంలో సీఐటీయూ నాయకులు ఉప్పేరు నర్సింహ, రంగన్న, బాలకృష్ణ, ఆంజనేయులు, వెంకటేష్, తిరుపతి, వీరేష్ ఉన్నారు.



బుక్‌లెట్‌ను విడుదల చేస్తున్న నాయకులు

అలంపూర్: పార్లమెంట్ ఎన్నికల్లో ఓటుతో బీజేపీని గద్దె దించుదామని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు రాజు, మండల కార్యదర్శి నరసింహ అన్నారు. అలంపూర్ పట్టణంలోని మహాత్మాజ్యోతిరావు పూలే విగ్రహం వద్ద సీపీఎం ఎన్నికల బుక్‌లెట్‌ను ఆవిష్కరించారు. గత ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క హామీని బీజేపీ ప్రభుత్వం నెరవేర్చలేదన్నారు. బీజేపీ పదేళ్ల పాలనలో చదువుకున్న యువత ఉద్యోగాలు లేక రోడ్డున పడ్డారన్నారు. కుల మతాల మధ్య చిచ్చు పెట్టి మత విద్వేషాలను రెచ్చగొడుతున్నారన్నారు. రాజ్యాంగాన్ని మార్చి దేశాన్ని మళ్లీ బానిసత్వంలో తీసుకుపోవడానికి ప్రయత్నాలు చేస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో నాగరాజు, పుల్లన్న, ఏలీయా, రాముడు, ఎసన్న, బాషా, మహమ్మద్, సుంకన్న, కృష్ణ, హుసేన్, రంగన్న ఉన్నారు.

అయిజ: రెండో సారి అధికారంలోకి వచ్చిన బీజేపీ దేశవ్యాప్తంగా సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని, రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలమైందని సీపీఎం జిల్లా నాయకుడు వీవీ నర్సింహ విమర్శించారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మల్లు రవిని గెలిపించాలని తెలిపారు. ఆదివారం పట్టణంలోని హమాలీ సంఘం కార్యాలయంలో హమాలీ సంఘం నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ బుక్‌లెట్‌ను విడుదల చేశారు.

ఆర్థిక ఇబ్బందుల్లో ఆయకట్టు రైతులు

- క్యాతూర్ లిఫ్ట్ రైతుల సమావేశంలో ఏకగ్రీవ తీర్మానం



సమావేశంలో పాల్గొన్న రైతులు

అలంపూర్ రూరల్: మండలంలోని క్యాతూర్ గ్రామంలోని హరిహర దేవాలయంలో హరిహర క్యాతూర్ లిఫ్ట్–2 అయకట్టు రైతుల సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. క్యాతూర్, బీమవరం, కోనేరు, లింగనవాయి రైతులు పాల్గొని పలు అంశాలపై ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. ఇందులో ప్రస్తుతం ఉన్న కమిటీ ఆయకట్టు రైతుల అకౌంట్స్ (జమ ఖర్చులు) చూయించాలని, ఈ నేల 15 లోపల జనరల్ బాడీ సమావేశం ఏర్పాటు చేసి చూయించాలన్నారు. గ్రామాల శివారులో పంట పొలాలకు నీరందడం లేదని, 3,600 ఎకరాల ఆయకట్టు దాదాపు 2,200 ఎకరాలకు నీరు పారేదని, 2023లో నాలుగు మోటార్లకు 2 మోటార్లు మరమ్మతులు ఉండడంతో ఆయకట్టు రైతులకు నీరు పారలేదని రైతులు నష్టాలతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. జమ ఖర్చులు అనంతరం తదుపరి కార్యాచరణ చేపట్టాలని ఏకగ్రీవ తీర్మానం చేశారు. లిఫ్ట్ కమిటీ చైర్మన్ చందు తక్షణమే స్పందించాలని వారు కోరారు. కార్యక్రమంలో నాలుగు గ్రామాల రైతులు తిప్పారెడ్డి, కామేశ్వర్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డి, సురేష్‌రెడ్డి, సూర్యచంద్రారెడ్డి, సామేలు, రాఘవరెడ్డి, శేఖర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, ఇబ్రహీం, పుల్లారెడ్డి, తదితర గ్రామాల రైతులు పాల్గొన్నారు.

జనజాతర సభకు తరలిన నాయకులు



మానవపాడు: అలంపూర్ నియోజకవర్గంలోని ఎర్రవల్లి చౌరస్తాలో ఆదివారం రాహుల్‌గాంధీ జనజాతర సభకు మండలంలోని వివిధ గ్రామాల నుంచి కాంగ్రెస్ నాయకులు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. వెళ్లిన వారిలో మాజీ సర్పంచ్ నరసింహులు, ఎల్ఐసీ నరసింహులు, శ్రీనివాసులు, శాంతన్న, కృష్ణయ్య, పరమేష్‌నాయుడు, మహిళలు, తదితరులు ఉన్నారు.

గద్వాల అర్బన్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఆదివారం ఎర్రవల్లిలో నిర్వహించిన రాహుల్‌గాంధీ బహిరంగ సభకు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున్న తరలివెళ్లారు. జిల్లా కేంద్రంలో జెడ్పీ చైర్‌పర్సన్ సరిత ఆధ్వర్యంలో వివిధ వార్డుల నుంచి నాయకులు, కార్యకర్తలు బయలుదేరారు.

కాషాయజెండా ఎగరబోతుంది

–● బీజేపీ ఎంపీ అభ్యర్థి భరత్‌ప్రసాద్



మాట్లాడుతున్న బీజేపీ ఎంపీ అభ్యర్థి భరత్‌ప్రసాద్

గద్వాల అర్బన్: నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఎన్నికల్లో కాషాయజెండా ఎగరబోతుందని బీజేపీ ఎంపీ అభ్యర్థి భరత్ ప్రసాద్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని నడిగడ్డ హక్కుల పోరాట సమితి కార్యాలయంలో ఆ సమితి జిల్లా చైర్మన్ రంజిత్‌కుమార్‌తో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. యువత, మహిళలు, ప్రజలు నరేంద్రమోదీ పథకాలకు ఆకర్షితులయ్యారన్నారు. బీజేపీతోనే నడిగడ్డ అభివృద్ధి సాధ్యమని, తనను ఆశీర్వాదించాలని కోరారు. బీజేపీకి మద్దతు తెలిపిన నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ రంజిత్‌కుమార్ మాట్లాడారు. నడిగడ్డ హక్కుల పోరాట సమితి కొనసాగిస్తూనే ఎన్నికల్లో బీజేపీ ఎంపీ అభ్యర్థికి సంపూర్ణ మద్దతు తెలుపుతామన్నారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, నడిగడ్డ హక్కుల పోరాట సమితి నాయకులు బుచ్చిబాబు, విజయ్ కుమార్, రంగస్వామి, గోవిందు, ఆంజనేయులు ఉన్నారు.

బీఆర్‌ఎస్, బీజేపీలకు గుణపాఠం చెప్పాలి

గద్వాల అర్బన్: తెలంగాణలో పదేళ్ల పాటు నిరంకుశ పాలన కొనసాగించిన బీఆర్‌ఎస్, ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభించిన బీజేపీలకు పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించి గుణపాఠం చెప్పాలని వివిధ సంఘాల నాయకులు అన్నారు. తెలంగాణ పీపుల్స్ జాయింట్ యాక్షన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీఓ భవనంలో కరపత్రాలు విడుదల చేశారు. కార్యక్రమంలో సీఎల్‌సీ సుబాన్, రైతాంగ సమితి నాయకుడు గోపాల్, పాలమూరు అధ్యయన వేదిక జిల్లా కన్వీనర్ ఇక్బాల్ పాష, టీపీఎఫ్ నాయకుడు ప్రభాకర్ తదితరులు ఉన్నారు.

పూర్వ విద్యార్థుల విద్యానిధి రూ.1.90లక్షలు



పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పాల్గొన్న విద్యార్థులు

వీపనగండ్ల: మండలంలోని తూముకుంట జిల్లా పరిషత్ పాఠశాలలో పూర్వ విద్యార్థుల సహకారంతో రూ1.90లక్షల విద్యానిధిని ఏర్పాటు చేశారు. పాఠశాల ఆవరణలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు ఎవరైనా మరణిస్తే వారి పిల్లల విద్యాభ్యాసం కోసం ఈ నిధి నుంచి సహకారం అందించాలని తీర్మానించారు. 1991–92 విద్యా సంవత్సరంలో తూంకుంట పాఠశాలలో చదివిన విద్యార్థులు ఆనాటి గురువులైన తలకంటి నారాయణరెడ్డి, బాలకృష్ణరాజు, కాంతారెడ్డి, ధర్మారెడ్డి, గాల్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, నర్సింహారెడ్డి, లోకనాథం, గాలయ్యను శాలువాలతో ఘనంగా సన్మానించారు. విద్యానిధి కోసం రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు తలకంటి నారాయణరెడ్డి రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా మరణించిన గురువులు, తోటి మిత్రులకు ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో రవీందర్‌రెడ్డి, బాలస్వామి, విజయ్‌కుమార్, సాయీశ్వర్, చంద్రయ్య, శ్రీదేవి, సునంద తదితరులు పాల్గొన్నారు.

కార్ల్‌మార్క్స్ సిద్ధాంతాలు ఆదర్శనీయం



అమరచింతలో మార్క్స్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న విజయరాములు



వనపర్తిలో మార్క్స్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

వనపర్తి టౌన్: కార్ల్ మార్క్స్ ప్రపంచంలో బానిసత్వ జీవితాల విముక్తి కోసం ఎనలేని కృషి చేశాడని, ప్రపంచవ్యాప్తంగా ఉన్న శ్రామిక, కార్మిక, నిమ్న కులాల హక్కుల సాధనకు నిరంతరం పోరాటం చేశాడని ప్రజావాగ్గేయకారుడు రాజారామ్‌ప్రకాశ్ కొనియాడారు. కారల్ మార్క్స్ జయంతిని పురస్కరించుకొని ఆదివారం జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో టీజేఏసీ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజారామ్‌ప్రకాశ్ మాట్లాడుతూ.. జనజీవన స్రవంతికి మార్క్స్ సిద్ధాంతాలు ఆదర్శనీయమని పేర్కొన్నారు. ప్రపంచానికి కమ్యూనిజం పరిచయం చేసిన కార్ల్ మార్క్స్ సిద్ధాంతం ప్రపంచ చరిత్రలో అజరామరం అని కొనియాడారు. కార్యక్రమంలో అఖిలపక్ష ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ సతీష్‌యాదవ్, కవి గిరిరాజాచారి, గంధం నాగరాజు, నాగరాజుచారి, అశోక్ చారి, ప్రకాష్ చారి, ఆర్టీసీ జేఏసీ నాయకుడు వహీద్ తదితరులు పాల్గొన్నారు.

అమరచింత: పెట్టుబడి దారి సిద్ధాంతం, శ్రమ దోపిడి గురించి చెప్పిన కార్ల్ మార్క్స్ ప్రపంచం ఉన్నంత వరకు జీవించి ఉంటారని సీపీఐ జిల్లా కార్యదర్శి విజయరాములు అన్నారు. పట్టణంలో సీపీఐ మండల, పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం మార్క్స్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దాస్ క్యాపిటల్ పుస్తకంతో కార్మికుల మిగులు శ్రమను పెత్తందారులు ఎలా దోచుకుంటున్నారో స్పష్టంగా వివరించారన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి అబ్రహం, భాస్కర్, శ్యాంసుందర్, కుతుబ్, మల్లేష్, ఎర్రన్న, నిస్సార్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

పాడుబడ్డ బావులతో ప్రమాదం

- రహదారి పక్కనే పొంచిఉన్న ప్రమాదం
- ఆదమరిస్తే ప్రాణాలు హరి
- ప్రమాదకరంగా నేల బావులు
- పడవు బావులు పూడ్చాలంటున్న ప్రజలు



పాతపాలెం - గంగన్‌పల్లి రోడ్డు పక్కన ముళపొదల్లో ఉన్న పాడుబావి

కేటీదొడ్డి: మండలంలోని రహదారుల పక్కనే ఉన్న బావులు ప్రయాణికులను, వాహనదారులను బెంబేలెత్తిస్తున్నాయి. మండలంలోని పాతపాలెం, గంగన్‌పల్లి వెళ్లే రోడ్డు పక్కనే ఉన్న బావి చెట్లు, ముళ్ల పొదలతో బావి నిండుకొని ఉంది. వాహనదారులు ఆదమరిస్తే ప్రమాదం సంభవిస్తుంది. వెంకటాపురం, పాగుంట వెళ్లే రహదారులకు అనుకుని ఉన్న బావి ఎప్పుడు, ఎవరి ప్రాణాలకు ముప్పు ఏర్పడుతుందోనని ఆందోళన చెందుతున్నారు. ఇర్కిచేడు ఇళ్ల మధ్యన ఉన్న బావి గ్రామస్తులకు పెద్ద సమస్యగా మారింది. ఉమిత్యాల స్టేజీ దగ్గర రోడ్డుకు పక్కన మరొక బావి ఉంది. ఈ బావి పక్కన వేగంగా వచ్చే వాహనాలు ఆ బావిలో పడి ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. గతంతో గంగన్‌పల్లి, పాతపాలెం, రోడ్డు పక్కన బావిలో ద్విచక్ర వాహనదారుడు అదుపు తప్పి పడడంతో గాయాలయ్యాయి. ఈ బావుల్లో గేదెలు, గొర్రెలు పడి గాయాలైన సందర్భాలెన్నో ఉన్నాయి. రోడ్డు పక్కన ప్రమాదకరంగా మారి నిరుపయోగంగా ఉన్న ఈ బావులను అధికారులు కంచె లేదా పూడ్చివేయాలని గ్రామాల ప్రజలు వేడుకుంటున్నారు.



నందిన్నె-రాయచూర్ వెళ్లే రోడ్డులో నందిన్నె పక్కన ఉన్న బావి

అదుపు తప్పితే అంతే..



పాతపాలెం, గంగన్‌పల్లి, రోడ్డు వెళ్లే దారిలో బావులు ప్రమాదకరంగా ఉన్నాయి. ఈ దారి గుండా నిత్యం వాహనాల రాకపోకలు అధిక సంఖ్యలో ఉంటుంది. ఏమాత్రం అజాగ్రత్తగా వాహనాలు నడిపినా అదుపు తప్పి బావిలో పడే అవకాశం ఉంది. అధికారులు స్పందించి బావులను పూడ్చేయాలి.

– వీరేష్, ఈర్లబండ

పడితే ప్రాణం పోవాల్సిందే..



మండలంలోని చాలా చోట్ల రహదారి పక్కన ప్రమాదకరంగా బావులున్నాయి. ఈ బావుల్లో అదుపుతప్పి పడితే ప్రాణాలు పోవాల్సిందే. గతంలో ఈ బావుల్లో పడినవారు ప్రాణాలు కోల్పోయినా ఘటనలు ఉన్నాయి. తక్షణం ఈ బావులకు కంచె లేదా పూడ్చేయాలని ప్రజలు కోరుతున్నారు.

– నాగేష్, నందిన్నె

పాడుబడ్డ బావులను గుర్తిస్తాం..

మండలంలోని ప్రమాదకరంగా ఉన్న పాడుబడ్డ బావులను గుర్తించడం జరుగుతుంది. వాటి వివరాలు సర్వే నెంబర్‌లతో పాటు నివేదికలు సిద్ధం చేసి ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీడీఓతో మాట్లాడతాం. రోడ్డు పక్కన ప్రమాదకరంగా ఉన్న బావులను కంచె, లేదా పూడ్చి వేసే ప్రయత్నం చేస్తాం.

– శివశంకర్, డిప్యూటీ తహసీల్దార్, కేటీదొడ్డి

కనిమెట్టలో హోం ఓటింగ్



దివ్యాంగుడితో ఓటు వేయిస్తున్న అధికారులు

కొత్తకోట రూరల్: పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలనే ఉద్దేశంతో ఎన్నికల అధికారులు దివ్యాంగులు, వృద్ధులు ఓటు వేసేందుకు ఇబ్బంది పడకుండా ఉండేందుకు ఇంటికి వెళ్లి ఓటు వేయించే విధానాన్ని తీసుకొచ్చారు. ఎన్నికల సిబ్బంది ఆదివారం మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలోని కొత్తకోట మండలం కనిమెట్ట గ్రామంలో హోం ఓటింగ్ ద్వారా దివ్యాంగుడితో ఓటు వేయించారు. కార్యక్రమంలో బీఎల్ఓ సువర్ణ, ఎన్నికల అధికారులు ఉన్నారు.